క్లుప్తంగా

ఎంపీకి వినతిపత్రం అందజేత



రాజాం: ఎంపీ బెల్లానకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేత రామ్మూర్తినాయుడు

రాజాం: తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరుతూ మున్సిపాలిటీ పరిధిలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులంతా ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు సోమవారం విచ్చేసిన ఆయనను వీరంతా సీఐటీయూ నేత రామ్మూర్తినాయుడు ఆధ్వర్యంలో కలిసి, తమ సమస్యలు వివరించారు. స్పందించిన ఎంపీ ఈ సమస్యను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేకు..

రాజాం సిటీ: తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని మున్సిపాలిటీ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఎమ్మెల్యే కంబాల జోగులుకు వినతించారు. ఇదే విషయమై వీరంతా సోమవారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఎం మండల కన్వీనర్ సీహెచ్ రామ్మూర్తినాయుడు, రాజేష్, గిరిబాబు, చిన్నబాబు, కనకరాజు, గోపి తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎం.సత్యవతి

వంగర: ఉపాధి హామీ పథకం ఏపీఓగా మర్రాపు సత్యవతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పక్కాగా ఉపాధి హామీ పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామని, అర్హులైన వారందరికీ జాబ్‌కార్డులు అందజేసి, పనులు కల్పిస్తామన్నారు.

తాగునీటి ఇక్కట్లు లేకుండా చర్యలు



పైపులైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు నర్సింహులు

రాజాం సిటీ: మండలంలోని పెనుబాక గ్రామంలో తాగునీటి ఇక్కట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు తెలిపారు. మరమ్మతులకు గురైన ఇంటింటి కుళాయిల పైపులైన్‌ను ఆయన సోమవారం దగ్గరుండి మరమ్మతులు చేయించి, పునరుద్ధరించారు.

చిన్నారులు, గర్భిణులకు వైద్యసేవలు

రేగిడి: మండలంలోని బూరాడ, చిన్నశిర్లాం, పెద్దశిర్లాం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులకు వైద్యారోగ్య సిబ్బంది సోమవారం వైద్యసేవలందించారు. అనంతరం వేసవి, వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు.

13 మద్యంసీసాల స్వాధీనం

బొబ్బిలి: మండలంలోని సీతయ్యపేట గ్రామానికి చెందిన మజ్జి గౌరీశంకరరావు అనే వ్యక్తి నుంచి అక్రమంగా తరలిస్తున్న 13 మద్యంసీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఈబీ సీఐ ఆర్.జైభీమ్ సోమవారం వెల్లడించారు.

అలాగే అలజంగి గ్రామంలోని వేగావతి నదీ తీరం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న చందక శంకరరావును అదుపులోకి తీసుకుని, 4 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకుని, పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

విద్యార్థులకు 'జగనన్న విద్యాకానుక'

జగనన్న విద్యాకానుక(జేవీకే) కిట్లు పంపిణీ సోమవారం అట్టహాసంగా జరిగింది. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారుల చేతులమీదుగా వీటిని విద్యార్థులకు అందజేశారు. చదువుకు పేదరికం అడ్డుకాకూడదని, ప్రతీ పేద విద్యార్థికీ కార్పొరేట్ విద్యనందించాలన్న దృఢ సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, ఇప్పటికే మనబడి నాడు–నేడు పథకం కింద పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, మౌలిక సదుపాయాలు కల్పించారని, ఏటా జేవీకే పథకం కింద విద్యార్థులకు ఓ స్కూల్ బ్యాగు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, 3 జతల యూనిఫాం, బూట్లు, రెండు జతల సాక్సులు అందజేస్తున్నారని తెలిపారు. విద్యార్థులంతా ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. – సాక్షి నెట్‌వర్క్



రాజాం సిటీ: విద్యార్థినికి జేవీకే కిట్లు అందజేస్తున్న డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీ



రామభద్రపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు జేవీకే కిట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



రేగిడి: చాటాయివలస స్కూల్‌లో జగనన్న విద్యాకానుక కిట్లు అందజేస్తున్న సర్పంచ్ గోవిందరావు



సంతకవిటి: జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు



బాడంగి హైస్కూల్‌లో జేవీకే కిట్ల పంపిణీలో విద్యార్థులతో ప్రజాప్రతినిధులు, అధికారులు



మెంటాడ: విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేస్తున్న సర్పంచ్ రాంబాబు



బొబ్బిలిబొబ్బిలి: పక్కి గ్రామంలో వైఎస్సార్ సీపీ నేత వేణుగోపాలనాయుడు చేతులమీదుగా జేవీకే కిట్ల పంపిణీ



తెర్లాంలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ, ఎంఈఓ త్రినాధరావు



రాజాం: కంచరాం స్కూల్‌లో విద్యార్థులకు జేవీకే కిట్లు అందజేస్తున్న సర్పంచ్ సుబ్బమ్మ

గడప గడపకూ 'సంక్షేమ' ఫలాలు



పూడివీధిలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

రామభద్రపురం: రాష్ట్రంలోని ప్రతి గడపకూ పథకాల రూపంలో సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని సచివాలయం–1, 2 పరిధిలో పూడి, పొందూరు, కూరాకుల, వసంతుల వీధుల్లో సోమవారం పర్యటించిన ఎమ్మెల్యేకు ఆయా ప్రాంతాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలతో పాటు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్న విషయం ఆయన దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజాసంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. అన్ని వర్గాలు అన్ని విధాలా బాగుండాలన్నదే ఆయన లక్ష్యమని, అందుకే ఆయన అనేక పథకాలు, కార్యక్రమాలు రూపొందించి, అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ఆయన సంక్షేమ పథకాలు అందిస్తున్న తీరు దేశానికే నిదర్శనమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతానికి పైగా హామీలు నెరవేర్చారని, ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ఇంతమంచి పాలన జరుగుతుంది కాబట్టే నాయకులు గడప గడపకూ వచ్చి, పథకాలు ఎలా అందుతున్నాయి, ఏవైనా సమస్యలున్నాయా అని అడగగలుగుతున్నారన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీ సిఫార్సుల మేరకే పథకాలు, అభివృద్ధి పనులు వచ్చేవన్నారు. ఇప్పుడు అలా కాదన్నారు. గ్రామగ్రామాన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా అభివృద్ధి, సంక్షేమంను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రజలకు ఇంత మంచి చేస్తున్న ప్రభుత్వంపై టీడీపీ, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. వాస్తవాలేంటో ప్రజలకు బాగా తెలుసన్నారు. ఇదే సంక్షేమ పాలన ముున్ముందు కూడా కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, జెడ్పీటీసీ ఎ.సరస్వతి, పార్టీ బొబ్బిలి మండల అధ్యక్షుడు ఎస్. వేణుగోపాలనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యుఎస్ రాయులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

వంగర: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండచాకరాపల్లి గ్రామంలో సోమవారం పర్యటించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వారి దృష్టికి పలువురు తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల కష్టాలను తీర్చడానికే గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ప్రభుత్వం తీసుకురావడం జరిగిందన్నారు. టీడీపీ హయాంలో మాదిరి ఏదైనా పథకం కావాలన్నా, అభివృద్ధి పని కావాలన్నా మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదన్నారు. సచివాలయాల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. గడప గడపకూ మేలు జరిగేలా అందిస్తున్న పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును చూసి, ఓర్వలేకనే టీడీపీ, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యు.సురేష్‌ముఖర్జీ, మండల పార్టీ కన్వీనర్ కె.సుదర్శనరావు, సర్పంచ్ ఒ.గౌయ్యమ్మ, ఎంపీటీసీ కె.సన్యాసినాయుడు, సర్పంచ్ ఎస్.శివరామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

వంగర: రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. సోమవారం మండలంలోని కొండచాకరాపల్లి గ్రామ సచివాలయంలో రైతులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ చేతుల మీదుగా వరి విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని, రైతులు బాగుండాలన్నదే ఆయన అభిమతమన్నారు. గతంలో రైతులు పడిన ఇబ్బందులు తలెత్తకుండా ఆయన సచివాలయాలకు అనుబంధంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, విత్తనం పంపిణీ నుంచి పంట విక్రయం వరకు అన్ని చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఖరీఫ్ అయినా రబీ అయినా విత్తనాలు, ఎరువులను సకాలంలో రైతులకు ఆర్బీకేల ద్వారా అందజేయడం జరుగుతోందన్నారు. ఇవే కాకుండా రైతుకు సాగు సాయానికి రైతు భరోసా పథకం కింద ఆర్థికసాయం అందజేయడం జరుగుతోందని, పంటల బీమా, యంత్రాల సరఫరా, మద్దతు ధర సౌకర్యాలు కూడా కల్పించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యు.సురేష్‌ముఖర్జీ, మండల పార్టీ కన్వీనర్ కె.సుదర్శనరావు, సర్పంచ్ గౌయ్యమ్మ, ఎంపీటీసీ కె.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఎస్‌వీఈపీ సర్వే

రాజాం: నియోజకవర్గంలో ఎస్‌వీఈపీ(స్టార్ట్ అప్ విలేజ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రాం) సర్వే పక్కాగా నిర్వహించేందుకు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎంలు, సీసీలు, సీఎఫ్‌లు, వీఓఏలంతా సహకరించాలని హైదరాబాద్ ఎస్ఆర్ఎల్ఎమ్, ఎంఎంఎస్ ట్రైనింగ్ బీపీఎం శేషగిరి, యంగ్ ప్రొఫెషనల్ ధనరాజ్ కోరారు. సోమవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద రాజాం క్లస్టర్ పరిధిలోని ఏపీఎంలు, సీసీలు, వీఓఏలతో సమీక్ష నిర్వహించారు. ఎస్‌వీఈపీ ఏర్పడి, ఐదేళ్లు కావస్తున్న సందర్భంగా అసెస్‌మెంట్ సర్వే నిర్వహిస్తున్నామని, ఈ సర్వేలో సంఘాల ద్వారా వచ్చిన రుణాలు, వినియోగం, వ్యాపారాభివృద్ధి, మహిళల ఆర్థిక ప్రగతి తదితర అంశాలను అసెస్‌మెంట్ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైకేపీ ఏసీ చిరంజీవి, ఏపీఎం దధికుమార్‌తో పాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఏర్పాటు



పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం

రాజాం సిటీ: మండల పరిధిలోని పొగిరిలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా పాస్టర్ ఎం.సింహాచలం, వైస్ ప్రెసిడెంట్‌గా టి.ఆండ్రూస్, కార్యదర్శిగా యస్.జాన్‌వసంత్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా ఆనంద పాల్, ట్రెజరర్‌గా టి.ఆదినారాయణ, అడ్వయిజరీ మెంబర్లుగా పి.రజనీకుమార్, జె.రత్నకుమార్, హెచ్ జాన్‌బాబు ఎన్నికయ్యారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో ఉన్న మండల పరిషత్ కార్యాలయాల్లో సోమవారం జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహించారు. మండల స్థాయి అధికారులతో ఎంపీడీఓలు సమావేశమై, ప్రజాసమస్యలు–వాటి పరిష్కారంపై సమీక్షించారు. స్పందన కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కరించాలని, పరిష్కరించడానికి వీలుకాని సమస్యను ఫిర్యాదిదారుకు ఆ సమస్య ఎందుకు పరిష్కారం కాలేదోనన్న కారణం తెలియజేయాలన్నారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



రామభద్రపురం: సూచనలిస్తున్న ఎంపీడీఓ రమామణి



తెర్లాం: వినతిపత్రం స్వీకరిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ



రాజాం: ప్రజాసమస్యలపై సమీక్షిస్తున్న ఎంపీడీఓ శంకరరావు



బొబ్బిలి: అధికారులతో ప్రజాసమస్యల పరిష్కారంపై సమీక్షిస్తున్న ఎంపీడీఓ రవికుమార్

సభాస్థలం పరిశీలన



జన్నివలస వద్ద సభాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: మండలంలోని జన్నివలస బీటీ రోడ్డు ప్రారంభోత్సవం నేపథ్యంలో మంగళవారం నిర్వహించే బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, పార్టీ బొబ్బిలి మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు వేర్వేరుగా సోమవారం పరిశీలించారు. ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు ఆధ్వర్యంలో టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కలిసి ఈ రోడ్డును ప్రారంభించనున్నారని వారు తెలిపారు. సభకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు హాజరై, కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ సీహెచ్ సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకోండి

రేగిడి: మండలంలోని ఆమదాలవలస, దేవుదళ, అక్కన్నఅగ్రహారం, లక్ష్మీపురం, చాటాయివలస గ్రామ రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాల కోసం రైతుల పేర్లు నమోదు చేసే ప్రక్రియ చాలా చురుగ్గా కొనసాగుతోంది. ఖరీఫ్ సాగుకు సంబంధించి, విత్తనాలు కావాల్సిన రైతులంతా తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని, ఆధార్‌కార్డు, పంట పొలాల వివరాలతో పేర్లు నమోదు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ తెలిపారు.

ఎంపీపీ సమీక్ష

వంగర: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులతో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ సోమవారం సమావేశమై, ప్రజాసమస్యలపై సమీక్షించారు. జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి వస్తున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ఐజాక్, ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, ఈఓపీఆర్‌డీ ఎల్.త్రినాద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన



తెర్లాం: కూనాయవలస పాఠశాలలో ప్రార్థన సమయానికే హాజరైన ఎంఈఓ త్రినాధరావు

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ జె.త్రినాధరావు సోమవారం సందర్శించారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభం అయిన వేళ విద్యార్థులు, సిబ్బంది సమయానికి హాజరయ్యారా, ఎంతమంది వచ్చారు అన్న విషయాలను ఆయన గమనించారు. ప్రతిరోజూ శతశాతం విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని, మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనం పెట్టాలని సిబ్బందికి సూచించారు.

ఆంజనేయస్వామి ఆలయ ఆదాయం రూ.1.14 లక్షలు

బొబ్బిలి: పాతబస్టాండు దగ్గరున్న ఆంజనేయస్వామి ఆలయం ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 2022 మే 1వ తేదీ నుంచి హుండీల్లో భక్తుల కానుకల రూపంలో చేరిన ఆదాయాన్ని దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కించగా, మొత్తం రూ.1,14,735 లభించినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరావు తెలిపారు.

సక్రమంగా భూముల రీసర్వే

రేగిడి: భూముల రీసర్వే సక్రమంగా చేపట్టాలని తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి సూచించారు. సోమవారం మండలంలోని పారంపేట గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వేను తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి పరిశీలించారు. అనంతరం ఆయన రైతుల సమక్షంలోనే సర్వేయర్లు సర్వే చేయాలని, సర్వే పూర్తయిన తర్వాత హద్దురాళ్ల ఏర్పాటు కూడా పక్కాగా చేపట్టాలని తెలిపారు. సర్వే సమయంలో రైతులు పాసుపుస్తకాలు, అడంగల్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు వంటివి అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

ధర్నా

బొబ్బిలి: ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి, రవాణా, హమాలీల చార్జీలను చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై ఆర్డీఓ కార్యాలయం ఎదురుగా సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం తమ సమస్యల పరిష్కారానికి ఆర్డీఓ పి.శేషశైలజకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం, సీఐటీయూ నేత ఎ.సురేష్, రైతులు పాల్గొన్నారు.